మరిపెడలో మాట్లాడుతున్న డోర్నకల్ మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్

పంటలకు బోనస్, రుణమాఫీ ఏమైంది..?

మరిపెడ రైతుదీక్షలో మాజీ మంత్రి రెడ్యానాయక్

మరిపెడ, ఏప్రిల్ 6 : పంటలకు రూ.500 బోనస్‌తోపాటు రూ.2లక్షల రుణమాఫీ ఏమైందని మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై శనివారం డోర్నకల్ నియోజకవర్గ కేంద్రమైన మరిపెడ మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి రైతుదీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొదట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రామసహాయం రంగారెడ్డి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం రెడ్యానాయక్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు రు.2లక్షల రుణమాఫీ చేస్తామని, రైతుబంధు పథకం కింద ఏడాదికి రూ.15వేలు, వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తామని హామీ ఇచ్చిందని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. సాగునీళ్లు అందక పంటలు ఎండిపోయిన రైతులను గుర్తించి ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం అందజేయాలన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రెండు పంటలకు సమృద్ధిగా సాగునీళ్లు అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కరువును తీసుకొచ్చి రైతులను ఇబ్బందిపెడుతున్నట్లు తెలిపారు. కరెంట్ కోతలు, సాగునీటి కష్టాలు రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ తేజావత్ శారద, ఎంపీపీ గుగులోత్ అరుణ, మాజీ ఎంపీపీ గుగులోత్ వెంకన్న, కుడితి మహేందర్‌రెడ్డి, ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, మైదం దేవేందర్, ఆయూబ్‌పాషా, సయ్యాద్‌లతీఫ్, పానుగోత్ వెంకన్న పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దటి నివారణకు చర్యలు తీసుకోవాలి

వైస్ ఎంపీపీ దేవేందర్

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ దేవేందర్

నర్సింహులపేట, ఏప్రిల్ 6: గ్రామా లు, తండాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ జాటోత్ దేవేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ ఉదయం 10.30 గంటలకు సభ ఉండగా, ఎంపీడీవో శ్రీను, ఏఈ పాండు, ఎంపీవో సోంలాల్, పంచాయతీ కార్యదర్శులు మినహా మిగిలిన అధికారులు ఒక్కొక్కరుగా ఉదయం 11.30గంటల వరకు రావడంతో సభ ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ మీటర్ల ఏర్పాటు చేసిన తర్వాతనే నీటి బావుల మోటర్లు వాడుకోవాలని, లేకపోతే సర్వీస్ తొలగిస్తామని ఏఈ పాండు తెలిపారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారని, త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ సూచించారు. కౌసల్యాదేవిపల్లి హెల్త్ సెంటర్‌లో ఉంటే ఏఎన్ఎం స్వరూపారాణిని డిప్యుటేషన్‌పై దంతాలపల్లికి ఏలా మారుస్తారని, మూడు గ్రామాలకు అవరమైన హెల్త్ సెంటర్‌లో ఏఎన్ఎంను అందుబాటులో ఉంచాలని సీహెచ్‌వో బాలాజీని ప్రశ్నించారు. చెరువులు, కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించాలని జడ్పీటీసీ సంగీత సభ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ఇచ్చే గ్యాస్ సబ్సిడీ అర్హులైన లబ్ధిదారులకు రావడం లేదని, లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. సదరం క్యాంపు సమాచారం గ్రామాల్లో ప్రజలకు తెలిసేలా టాం టాం వేయించాలని ఎంపీడీవో శ్రీను పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సమావేశానికి కొందరు అధికారులు రాకపోవడంతో తూతూ మంత్రంగా సాగింది. కార్యక్రమంలో జడ్పీటీసీ భూక్యా సంగీత, ఎంపీటీసీలు రవి, నాయకీ, అనిల్, మధురెడ్డి, కో ఆప్షన్ మెంబర్ సర్వర్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో శ్రీను, ఎంపీవో సోంలాల్, ఏఈ పాండు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ పాల్గొన్నారు.

రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, పక్కన ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

దద్దమ్మ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలె..

- కాళేశ్వరంలో ఉన్న నీళ్లివ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గోస పెడుతున్నది..
- కావాలనే కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నది..
- వరికి బోనస్, రైతుబంధు ఏమాయె..?
- పార్టీలో చేర్చుకోవడంలో ఉన్న సోయి.. పాలనపై లేకపాయె..
- నెల్లికుదురు రైతు దీక్షలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ధ్వజం

నెల్లికుదురు, ఏప్రిల్ 6 : గత పదేళ్లల్లో కేసీఆర్ ప్రభుత్వంలో రైతే రారాజు.., ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పెట్టుబడి సాయం అందక, సాగు నీళ్లు లేక అల్లాడిపోతున్నాడని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. రుణమాఫీ, రైతుబంధు, వరి ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. శనివారం నెల్లికుదురు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రైతుదీక్షలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నడూ పంట పొలాలు ఎండిపోయిన దాఖలాలు లేవన్నారు. కాళేశ్వరంలో నీళ్లున్నా వదలకుండా సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నాడని, రైతులు గమనించాలని కోరారు. ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని వంద సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌దని, ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు వంద రోజుల సమయాన్ని పెట్టుకొని ఒక్కటి అమలు చేయని దద్దమ్మ కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతు బంధు వేయకుండా ఆపేసి, ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రైతుబంధు వేయలేని చేతగాని ప్రభుత్వం కాంగ్రెస్‌అని మండిపడ్డారు. ఎకరాకు రూ.15వేల సాయమంటివి.., మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2500 అంటివి.., రూ.500కే గ్యాస్ సిలిండర్ అంటివి.. ఇప్పటి వరకు ఒక్కటైనా నెరవేర్చలేకపోతివని సీఎం రేంవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పాలనలో ఇప్పటి వరకు సుమారు 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిన రైతులకు భరోసానిస్తూ కేసీఆర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంటే, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇవేమీ పట్టనట్లు క్రికెట్ చూస్తూ జల్సాలు చేస్తున్నాడని అన్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. కాళేశ్వరంలో ఉన్న నీళ్లు ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పంట పొలాలను ఎండగొడుతూ.., కావాలనే కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నాడని అన్నారు. కేసీఆర్ అన్నదాతలకు భరోసాగా బయటికొచ్చిన మరుసటి రోజే కాళేశ్వరం నీళ్లేలా వచ్చాయి..? అని ప్రశ్నించారు. నాడు దర్జాగా ఉండే మా పరిస్థితి.. నేడు దీనంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నట్లు తెలిపారు. దందాలు చేసేది కాంగ్రెసోళ్లు.., అక్రమంగా కేసులు మాత్రం మా కార్యకర్తలపై పెడుతారా...? ఇదెక్కడి సంస్కృతి అని మండిపడ్డారు. మా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం.. మా జోలికొస్తే తరిమికొడతామని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, మండ ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, శ్రీరామగిరి సొసైటీ చైర్మన్ గుండా వెంకన్న, మాజీ సర్పంచ్ యాదగిరిరెడ్డి, రాష్ట్ర నాయకుడు యాకూబ్ రెడ్డి, భీముడు, రుక్మిణి, అశ్విన్, కొమ్ము అనీల్, మంద అశోక్, మహేశ్, మురళి, సంజీవ, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

నెల్లికుదురు, ఏప్రిల్ 6 : ఓటు వజ్రాయుధమని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో బాలరాజు సూచించారు. ఓటరు అవగాహన కార్యక్రమంలో శనివారం నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఏపీఎం, సీసీలు, వీవోలు, వీవోఏలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమాలు చేపట్టాలి

మహబూబాబాద్, ఏప్రిల్ 6 : జిల్లాలో ఓటరు నమోదు కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని స్వీప్ నోడల్ అధికారి జనిగు మరియన్న అన్నారు. శనివారం మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం నుంచి మహిళా సంఘాలతో కలిసి స్వీప్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మరియన్న మాట్లాడుతూ అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా సివిల్‌సప్లయ్ మేనేజర్ కృష్ణవేణి, డీఎస్‌వో రాజేందర్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దంతాలపల్లి, ఏప్రిల్ 6: ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దముప్పారం పల్లె దవాఖాన డాక్టర్ వాణి సూచించారు. మండలంలోని రామనుజపురం గ్రామంలో శనివారం ఆమె వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

నర్సింహులపేట, ఏప్రిల్ 6 : ఎండదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎన్ఎం ప్రసన్నకుమారి కూలీలకు సూచించారు. శనివారం మండలంలో పిచ్చిరాంతండాలో మిరప కాయలు ఏరుతున్న కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దవంగర : వేసవిలో ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఎల్‌హెచ్‌వీ రాజ్‌కుమార్ అన్నారు. శనివారం వరల్డ్‌హెల్త్ డేను పురస్కరించుకొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ ప్రత్యేక అధికారి స్వాతి, హెల్త్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, కార్యదర్శి రజిత, ఏఎన్ఎం బాబు పాల్గొన్నారు.

భూ తగాదాలో ఇద్దరి రిమాండ్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 6 : భూమి తగాదాలో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ దేవేందర్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. పట్టణ శివారులోని ల్యాండ్ విషయంలో ఇరు వర్గాల మధ్య తగాదా జరిగి, కుండె బీరయ్యపై బత్తుల కృష్ణ, ముఖేశ్ దాడి చేశారు. బీరయ్యకు తీవ్ర గాయాలు కాగా, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బత్తుల కృష్ణ, ముఖేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రతి మనిషిలో భగవంతుడు ఉన్నాడు

చిన జీయర్‌స్వామి

భక్తులకు ప్రవచనాలు చేస్తున్న చిన జీయర్ స్వామి

గూడూరు, ఏప్రిల్ 6 : భగవంతుడు ప్రతి మనిషిలో ఉన్నాడని, ఆ భగవంతుడి చూసేందుకే ఆలయంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. శనివారం మండలంలోని మధనాపురం గ్రామంలో ప్రారంభించిన శ్రీగోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించి పూజలు చేశారు. సంప్రోక్షణ అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రవచించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందేలా ఇలాంటి దైవ కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. కాంట్రాక్టర్ లింగాల రాధికాసుధీర్‌రెడ్డి, అనుపమారోహిత్‌రెడ్డి దంపతులు, నితిన్ రెడ్డి, ఎంపీ కవిత, ఎస్టీ సెల్ జాతీయ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ చల్లా లింగారెడ్డి పాల్గొన్నారు.

'మన ఆరోగ్యం...మన హక్కు

మహబూబాబాద్, ఏప్రిల్ 6: మన ఆరోగ్యం.. మన హక్కు అని, దానికి కాపాడుకోవాలని జిల్లా వైద్యాధికారిణి కళావతి బాయి అన్నారు. శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్యులతో కలిసి నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో కళావతిబాయి మాట్లాడారు. జిల్లా ఉపవైద్యాధికారి అంబరీష, ప్రోగ్రాం అధికారులు సుధీర్‌రెడ్డి, బిందుశ్రీ, విజయ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, సీహెచ్‌వో కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి సురేశ్

మాట్లాడుతున్న జడ్జి సురేశ్

కురవి, ఏప్రిల్ 6: రోగం వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే, రోగం రాకముందే.., లక్షణాలు కనిపించినప్పుడే చికిత్స తీసుకోవడం వల్ల ఖర్చు, శ్రమ తగ్గుతుందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సురేశ్ అన్నా రు. కురవి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎండలు విపరీతంగా ఉన్నాయని, అనవసరంగా ఎండలో తిరిగి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు విరాజిత, చైల్డ్ లైన్ సభ్యులు డాక్టర్ అశోక్, కురవి ఎస్సై గోపి, కోర్టు కానిస్టేబుల్ లింగయ్య పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తప్పవు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్‌లోని సఖి సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 6 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేసే అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. శనివారం ఆయన జిల్లాలోని కురవి మండలం బలపాల, గజతండా, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలు, సఖీ సెంటర్, బాలల సదనాలను ఆకస్మికంగా సందర్శించి, తనిఖీలు చేశారు. బలపాల జిల్లా పరిషత్ హైస్కూల్, అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, పిల్లలకు అందుతున్న సౌకర్యాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఐదు సబ్‌హెల్త్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, ఇన్, అవుట్ పేషెంట్ల వివరాలను మెడికల్ అధికారి స్రవంతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎండలు ముదిరినందున సబ్ సెంటర్లలో, క్షేత్రస్థాయిలో ఆశ కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర చికిత్స కోసం మందులను అందుబాటులో ఉంచుకొని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలన్నారు. తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే రూపొందించిన యాక్షన్ ప్లాన్ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న గుడ్లు, పాలు, నూనె, బాలామృతం, పప్పులు సమయానికి అందజేయాలన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని బాల సదనం, సఖీ సెంటర్లలో రికార్డులను తనిఖీ చేసి హాజరు పట్టికలను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిరాధారణకు గురైన, తల్లిదండ్రులు లేని పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో చదువుకునేలా ఏర్పాటు చేయాలన్నారు.

సఖీ సెంటర్‌లో ఆశ్రయం పొందుతున్న మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. మెనూ ప్రకారం భోజన వసతులు ఏర్పాటు చేసి, వారి ఆరోగ్యం క్షీణించకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సునీల్ రెడ్డి, ఎంపీడీవో వీరబాబు, మెడికల్ అధికారి స్రవంతి, వసతి గృహాల నిర్వాహకురాలు లక్ష్మి, సుగుణ, మనీష, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో ఎండలో పనిచేయించొద్దు

బయ్యారం, ఏప్రిల్ 6 : కూలీలతో ఎండలో పని చేయించొద్దని వైద్యాధికారి విజయ్ సూచించారు. మండలంలోని కొత్తపేట, నామాలపాడు, గంధంపల్లి సమీపంలోని ఇటుక బట్టీల యజమానులకు కొత్తపేట పంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నందున కూలీలతో ఉదయం 10లోపు, సాయంత్రం 4గంటల తర్వాత పని చేయించాలన్నారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు పని ప్రదేశాలకు రాకుండా చూసుకోవాలన్నారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

గార్ల : ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సక్రు అన్నారు. శనివారం మండలంలోని చిన్నకిష్టాపురంలో తాసుపాముల కుంటలో ఆయన కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశాల్లో కూలీలకు ఎండ తగలకుండా టెంట్లు, తాగు నీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పని దినాలను రెండు వందల రోజులకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సక్రు, కోట్యా, టీక్యా, భాస్కర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం : ఇటుక బట్టీల యజమానులతో మాట్లాడుతున్న వైద్యాధికారి విజయ్

గార్ల : మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సక్రు

యూనిఫామ్ కొలతల ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈవో రామారావు

సకాలంలో యూనిఫామ్స్ అందజేయాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 6 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్స్ అందేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు సూచించారు. శనివారం పట్టణంలోని యూపీఎస్సీ పాఠశాలలో యూనిఫామ్స్ కొలతల ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. పాఠశాలల ప్రారంభాని కంటే ముందుగానే విద్యార్థులకు యూనిఫామ్స్ అందాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, డీఎస్‌వో అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 6 : పట్టణంలోని 11కేవీ 5 ఫీడర్ పరిధిలో కొన్ని ఏరియాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ ఏఈ నవ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల మీద చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఉదయం 7నుంచి 11.30 గంటల వరకు నిలిపివేస్తామన్నారు. నందినగర్, గుండ్లకుంట స్తూపం, ఆర్టీసీ కాలనీ, గిరిప్రసాద్, రాహుల్‌నగర్, కంకర్‌మిల్, చిట్యాల గోపయ్య, ఏటిగడ్డ తండా, రామచంద్రపురంకాలనీ, బతుకమ్మ విగ్రహం ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

మహిళల భద్రత కోసమే షీ టీమ్స్

కేసముద్రం, ఏప్రిల్ 6 : మహిళల భద్రత కోసమే షీ టీమ్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు షీ టీమ్స్ ఎస్సై సునంద తెలిపారు. మహబూబాబాద్ ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సెయింట్ జోన్స్ స్కూల్‌లో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత కోసం షీ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు ఆపద సమయాల్లో షీ టీమ్‌లను ఉపయోగించుకోవాలన్నారు. వాట్సాప్ నంబర్లు 8712656935, 7901142009 సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కిరణ్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు లాల్‌బాదుర్, షీ టీం ఏఎస్సై ఆనందం, సిబ్బంది అరుణ, పార్వతి, రమేశ్, ఏహెచ్‌టీయూ యూనిట్ సభ్యులు ఊర్మిల పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న పులి దేవేందర్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 6 : ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి దేవేందర్ అన్నారు. శనివారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన విధంగా సీపీఎస్ రద్దు చేయాలన్నారు. ఎలక్షన్ కమిషన్ అనుమతితో వేసవిలో ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, రాంజీ, రాజమౌళి, ప్రవీణ్, సాదిక్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

డోర్నకల్, ఏప్రిల్ 6 : వివాహిత అదృశ్యమైన ఘటన డోర్నకల్ మున్సిపాలిటీ పరిధి పంపుబావి తండాలో శనివారం జరిగింది. సీఐ ఉపేందర్‌రావు కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని పంపుబావి తండాకు చెందిన శిరీష ఈ నెల 4న కూతురుకు గైడ్ తీసుకొస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు ఇంట్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. శిరీష భర్త సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బయ్యారం, ఏప్రిల్ 6 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బయ్యారం మండలంలో శనివారం జరిగింది. కొత్తగూడ మండలం కార్లయి గ్రామానికి చెందిన కేదాస్ ప్రసాద్, బంధువు సైదమ్మ పని నిమిత్తం బైక్‌పై మహబూబాబాద్‌కు వచ్చి బయ్యారం మీదుగా వెళ్తున్నారు. చర్లపల్లి శివారులో టెంకమెత్తల ప్రాంతం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి వరంగల్‌కు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లెప్రసీ వైద్య శిబిరం

డోర్నకల్, ఏప్రిల్ 6 : మండలంలోని చిల్కోడు, పెరుమాండ్ల సంకీస గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం లెప్రసీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నాలుగు లెప్రసీ కేసులను గుర్తించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో ఎల్లయ్య, సీహెచ్‌వో వీరబాబు, సూపర్‌వైజర్లు వెంకన్న, విజయ కుమారి పాల్గొన్నారు.

కానూరి వర్ధంతి సభను జయప్రదం చేయాలి

బయ్యారం, ఏప్రిల్ 6: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వరరావు వర్ధంతి సభ జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పొమ్మయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని సుద్దరేవులో కానూరి వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కర